


వై. రాంబాబుశాయి

ప్రరిగా విద్యానగర్ స్టాప్‌లో తొమ్మిది గంటల ఇరవై నిమిషాలకు వన్ ఎస్ బస్ రావడం తరువాయిగా కళ్ళద్దాల అబ్బాయీ, రెండు జళ్ళ అమ్మాయీ రథాన్ని అధిరోహిస్తారు. ఆ వేళకు బస్సు ఖాళీగానే ఉండడం కద్దు. అప్పుడిద్దరూ ఒకే సీట్లో కూచుంటారు. ఒకరి నొకరు చూసుకుని నవ్వుకుంటారు. నవ్వుకుంటూ కబుర్లెన్నో చెప్పుకుంటారు. చార్మినార్ స్టాప్‌లో యిద్దరూ దిగి సరదాగా నడుచుకుంటూ వెళతారు.

కండక్టరు కందసామికి వాళ్ళిద్దరూ చిరపరిచితులు. వాళ్ళు బస్సెక్కగానే అతను హలో అంటాడు. పాపం వాళ్ళిద్దరూ ఎప్పుడూ టికెట్లు తీసుకోరు. ఎందుకంటే వాళ్ళకి యన్. జీ. వో. పాసులున్నాయి.

బస్సెక్కే వేళకు ఇద్దరూ ఒకచోట కూచునేందుకు జాగా దొరక్కపోతే ఇద్దరూ ఒకేచోట నిలబడతారు. అవకాశం రాగానే సీట్లు దొరికించుకుని నవ్వుకుంటారు.

కళ్ళద్దాల అబ్బాయి మంచి శీవి గలవాడు. మంచి అందంగలవాడు. అతనెప్పుడూ మంచిబట్టలు ధరిస్తాడు.

రెండుజళ్ళ అమ్మడుకూడా చాలా అందమైన పిల్ల. ఎప్పుడూ గులాబీ పూవులా ఉంటుంది. మల్లెపువ్వులా నవ్వుతుంది.

వాళ్ళని చూసినప్పుడల్లా—"బహా

మంచి జంట" అనుకుంటాడు కంద సామి.

కళ్ళద్దాల అబ్బాయీ, రెండుజళ్ళ అమ్మడూ ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాయి. కళ్ళద్దాల అబ్బాయికి చమక్కులు విసరడంలో బహుమంచి నేర్పుంది. ఈ మాట కథకు లిద్దరికే కాదు అమ్మడిక్కూడా బాగా తెలుసు. ఆ మాటకొస్తే కందసామికి తెలుసు. టికెట్లు ఇష్యూ చేయడం ముగించుకుని కందసామి వాళ్ళిద్దరూ కూచున్న చోటికి పరుగెట్టుకొస్తాడు. కళ్ళద్దాల అబ్బాయి విసిరే అద్భుతమైన విసుర్లకు బస్సుటాపు లేచిపోయేలా నవ్వుతాడు.

రోజులన్నీ ఒకలా నడిచిపోతే ఇన్ని కథలు పుట్టుకు రావలసిన పని లేదు.

వారంరోజులు వరుసగా ఆ జంట కనిపించక పోయేసరికి కందసామి బోలెడంత బెంగ ఫీలయ్యాడు వాళ్ళిద్దరూ ఏమైపోయ్యారో అతనికి తెలీలేదు. ఇద్దరికీ ఉద్యోగం పోయిందేమో అనుకున్నాడు. తెలంగాణా అలజడికి భయపడి ఇద్దరూ బెజవాడబండికి తరలిపోయారేమో అనుకున్నాడు.

అతని అంచనా నూటికి నూరు పాళ్ళు తప్పైపోయింది.

ఒక సోమవారంనాటి ఉదయం తొమ్మిదిగంటల ఇరవై నిమిషాలకు కందసామి కండక్టరుగా నిలబడ్డ బస్సు విద్యానగర్ స్టాప్‌లో ఆగింది.

బిచ్చగాడు : అమ్మా నీ చేయి పెద్దది, తెల్సుతల్లీ....
ఇంటావిడ : నీ కెట్లా తెల్సురా అబ్బీ!
బిచ్చగాడు; ప్రహరీగోడకు కొట్టిన పిడక సైజునుబట్టి.

ఆగిందే తడవుగా రెండు జళ్ళ అమ్మడు బస్సెక్కింది. సరాసరి ఆడవాళ్ల సీటులోకి పోయి కూచుంది. కళ్లద్దాల అబ్బాయి ముందు సీట్లో ఒక మూలకు ఒదిగి కూచున్నాడు. అప్పుడు బస్సంతా దాదాపు ఖాళీగానే ఉంది. నలుగురైదుగురు తప్ప బస్సులో జనం లేరు.

కందసామికి కథంతా విచిత్రంగా ఉంది. అతను కళ్లద్దాల అబ్బాయిని హలో అన్నాడు. కళ్లద్దాల అబ్బాయి అత్యంత బరువుగా నవ్వాడు. ఆరోజు అతనికి చమత్కారం సంగతి బొత్తిగా తెలీనట్టు గంభీర ముఖపద్మంతో కూర్చున్నాడు.

కందసామి రెండుజళ్ల అమ్మణ్ని చూశాడు. ఆపిల్ల అసెటో చూస్తూ గంభీరంన్నర ముఖపద్మంతో కూర్చుంది.

వాళ్ళిద్దరూ ఏవో జగడంలో చమత్కారాల్నీ, నవ్వుల్నీ పోగొట్టుకున్నారు కాబోలనుకున్నాడు కంద సామి.

మంగళవారంనాడు చూశాడు.

బుధవారం నాడు చూశాడు. ఆ మరునాడు కూడా చూశాడు. బస్సు ఖాళీ లేక పోయినా, ఒకే చోట నిలబడి, సీటు దొరగ్గానే ఒకే సీట్లో కూచుని నవ్వుతూ ఒకరి నొకరు చూసుకొని, చార్మినార్‌లో దిగి సరదాగా నడిచి పోయే వీళ్ళు అకస్మాత్తుగా ఒకరి కొకరు తెలీనట్టుగా ఒకరొక మూల మరొకరో మూల గంభీరంగా గడపడం అతనికస్సలు నచ్చలేదు.

శుక్రవారం నాడు నయాపూల్ దగ్గర కందసామి కారణమేమిటని అడక్కుండా వుండలేక పోయాడు.

కళ్లద్దాల అబ్బాయి ముందు బిత్తరపోయాడు. తరువాత చిన్న మోతాదులో సిగ్గు పడ్డాడు. ఆపైన రవంత నవ్వాడు.

"ఏంలేదు" అన్నాడు.

"మీరుదా జగడం సేస్తిరా ఏమి సామీ?" అని అడిగాడు కందసామి.

"ఏంలేదు కందసామీ: వారం రోజుల క్రితం మాఇద్దరికీ పెళ్లయింది. అదీ సంగతి" అని మెల్లగా చెప్పాడు కళ్లద్దాలబ్బాయి.

కందసామి మరేం మాటాడ్లేదు. ●●●


## "తెలంగాణా పోరాటం"

16 పేజీలలో కుదించిన 50 ఫొటోలతో, సుమారు 200 పేజీల పుస్తకం. తెలంగాణలో జరిగిన అపూర్వ పోరాటానికి కారణాలు, పూర్వచరిత్ర, ప్రజాసమితి అగ్రనాయకుల వివాదాల అంతరంగం, తెలంగాణలో ఉన్న ఆంధ్రులపై అత్యాచారాలు మొదలైన విషయాలు సవివరంగా చర్చించబడినవి. ఉద్యమంలో ఏయే దశలో ఎవరెవరు చేర ఏమి త్యాగాలు చేసినది వివరించబడిన ఈ పుస్తకం పత్రికా రచయిత శ్రీ ఆదిరాజు వెంకటేశ్వరరావు, ఒక ఉపాధ్యాయుడు. శ్రీ బి. యస్. యస్ రామచంద్రరావు, ఉద్యమంతో ఏసంబంధమూలేని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఒక విద్యార్థిని సంపాదకత్వాన వెలువడింది. వెల మూడు రూపాయలు, ఏజంట్లు 25 శాతం డబ్బు మినహాయించుకొని తమకు కావలసిన కాపీలధర ముందుగా మనియార్డరు లేక డ్రాఫ్ట్ ద్వారా పంపాలి.

సోల్ డిస్ట్రిబ్యూటర్
వి. శ్రీహరిరావు
4-1-982, అబిడ్ రోడ్, హైదరాబాదు-1.